# కలకాలం గుర్తుండేలా అభివృద్ధి



రుద్రమాంబనగర్‌లో పార్టీలో చేరుతున్న యువతకు కండువ కప్పి ఆహ్వానిస్తున్న నరేందర్

- 'తూర్పు'లో సమీకృత కలెక్టరేట్ ఏర్పాటు
- రానున్న రోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు
- మరోసారి గులాబీ జెండాను ఎగురవేయాలి
- ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- బీఆర్ఎస్‌లో చేరిన ముదిరాజ్ యువకులు

ఖిలావరంగల్, నవంబర్ 5: వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని కలకాలం గుర్తుంచుకునేలా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. శివనగర్ రుద్రమాంబనగర్‌లో ఆదివారం ముదిరాజ్ యూత్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2005లో కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పుడు ఖిలా వరంగల్ రోడ్డులోని ముదిరాజ్ కాలనీ వాసులు తనను చేయి పట్టుకొని నడిపించారన్నారు. రూ. 500 వేతనంతో ప్రారంభమైన తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలను ఎదుర్కొని ఎమ్మెల్యేగా ఎదిగానన్నారు. సీఎం కేసీఆర్ పోరాట ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణను బీఆర్ఎస్ సర్కారు ఆధ్వర్యంలో గొప్పగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో 10 వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. తూర్పు నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రం చేసి సమీకృత కలెక్టర్ భవన సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి తూర్పులో గులాబీ జెండాను ఎగురవేయాలని నన్నపునేని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో పొన్నం నరేశ్, బోళ్ల స్వప్న, ప్రదీప్, క్రాంతితోపాటు సుమారు 70 మంది ఉన్నారు. కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ పాల్గొన్నారు.

**హామీలు నిలబెట్టుకునే జిమ్మేదారి నాదే..**

గిర్మాజీపేట: వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమని, తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకునే జిమ్మేదారి నాదేనని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 33వ డివిజన్ రాజశ్రీగార్డెన్‌లో నియోజకవర్గంలోని మేరు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేరు కులస్తులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు నన్నపునేనికేనని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే నరేందర్ తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించి, అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ మేరు కులస్తుల ఆత్మగౌరవ భవానానికి 300 గజాల స్థలం కేటాయించానని, భవనాన్ని నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. నియోజకవర్గంలో 18 కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం స్థలం కేటాయించానన్నారు. తెలంగాణను దేశానికే మోడల్‌గా నిలుపుతున్న బీఆర్ఎస్ సర్కారును మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేరు కులస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమ ప్రభుత్వం వైపే..**

ప్రజలంతా ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన అన్నారు. సాయినగర్‌కాలనీకి చెందిన వివిధ పార్టీల నుంచి పలువురికి ఆమె గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం కాలనీలో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి నరేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమికి రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కొలిపాక శ్రీనాథ్, బోయిని రవి, బర్మా స్వామి పాల్గొన్నారు.

**మరోసారి బీఆర్ఎస్‌దే అధికారం**

కరీమాబాద్: రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారం చేపట్టనుందని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధీమా వ్యక్తం చేశారు. 32వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకురాలు పసునూరి సువర్ణ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ తెలంగాణలో ఇతర పార్టీలు ప్రజల విశ్వాసం కోల్పోయాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ, మాజీ కార్పొరేటర్ పల్లం రవి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, నాయకులు సంజయ్‌బాబు, శివమూర్తి, రాజమణి పాల్గొన్నారు.

**గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న నన్నపునేని**

నగరంలోని 40వ డివిజన్‌లో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు అండగా ఉండానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఫకీర్వాడలో బీఆర్ఎస్‌లో చేరిక**

పోచమ్మమైదాన్: వరంగల్ 23వ డివిజన్‌కు చెందిన ఇతర పార్టీల యూత్ కార్యకర్తలు పోచమ్మమైదాన్ ఫకీర్వాడలో ఆదివారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతీ సత్యనారాయణ, నిహాల్ యాదవ్, సునీల్ యాదవ్, కట్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20 మంది యూత్ కార్యకర్తలు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొల్లు సతీశ్, చిప్ప వెంకటేశ్వర్లు, బేతి అశోక్, కర్రె రవి, శ్రీకాంత్, కార్తీక్, కుమార్ పాల్గొన్నారు.



మెట్టు దర్వాజ నుంచి అశేష జనం మధ్య ర్యాలీగా తరలుతున్న ఎమ్మెల్యే నరేందర్

## కాంగ్రెస్ పాలనలో..
# అభివృద్ధికి నోచుకోని 'తూర్పు'

- ఆజంజాహి మిల్లును అమ్ముకున్నరు
- సీఎం కేసీఆర్ టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయించారు
- పది వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- కోటలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు
- మెట్టు దర్వాజ వద్ద ఎమ్మెల్యేకు ఘన స్వాగతం
- 'కారు గుర్తుకే మన ఓటు' నినాదంతో దద్దరిల్లిన కోట

ఖిలావరంగల్, నవంబర్ 5: కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 38వ డివిజన్ మున్నూరుకాపు వాడలో ఆదివారం కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్‌తో ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మందితో బీఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీలో చేరుతున్న నాయకులు, ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్‌కు మెట్టు దర్వాజ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. రెండు కిలో మీటర్ల పొడవునా కొనసాగిన ర్యాలీలో కారు గుర్తుకే మా ఓటు.. జై నరేందరన్న అంటూ చేసిన నినాదాలతో కోట దద్దరిల్లింది. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ హయాంలోనే అజంజాహి మిల్లును అమ్ముకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి, మూడు కంపెనీలు నెలకొల్పారని, తూర్పు నియోజకవర్గానికి పది వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో రూపొందించారన్నారు. మన భవిష్యత్ కోసం వరంగల్ నగరంలో కలెక్టరేట్, ఆధునిక బస్‌స్టేషన్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇన్నర్ రింగ్‌రోడ్, ఏడు గురుకుల పాఠశాలలు, 24 అంతస్తుల హాస్పిటల్.. ఇలా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు ఖిలావరంగల్‌లో విద్య, వైద్యం, తాగునీరు, కమ్యూనిటీ భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు ఎందుకు పూర్తి చేయాలేదని ప్రశ్నించారు. మోసపూరిత ప్రచారాలతో వచ్చే నాయకులు అగడ్త రోడ్డు వేయించామని చెప్పుకుంటున్నారని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కూరగాయల మార్కెట్‌లో మన ఖిలావరంగల్‌కు చెందిన రైతులు అమ్ముకునే అవకాశం కల్పించామన్నారు. మన నియోజకవర్గంలోని పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ఉద్దేశంతో 110 రోజులపాటు ఉచితంగా కోచింగ్, భోజనం, మెటీరియల్ అందించానని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో 25 వేల మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. పడమర, మధ్య కోటను అభివృద్ధి చేశానని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు ఒకటి మిగిలి ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు చెందిన కొప్పుల క్రాంతి, పద్మ, ఆకుల వెంకటేశ్వర్లు, సుంకరి రాజు, బోనగోరి నరేశ్, రంజిత్, బొల్లం తిలక్, హరిప్రసాద్, హరీశ్‌తోపాటు సుమారు 80 కుటుంబాలు నన్నపునేని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## దేశాయిపేటలో డ్రైనేజీ పనుల పరిశీలన

పోచమ్మమైదాన్, నవంబర్ 5: వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేట మసీదు గల్లీలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ, కల్వర్టు పనులను కార్పొరేటర్ కావటి కవితా రాజుయాదవ్ ఆదివారం పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

## 8న జేఎన్ఎస్‌లో బాక్సింగ్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 5: ఈ నెల 8న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లోని బాక్సింగ్ హాల్‌లో డిస్ట్రిక్ట్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా సీనియర్స్ పురుషుల బాక్సింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడ్ల సురేందర్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు బర్త్ సర్టిఫికేట్, ఆధార్, హెపటైటిస్, హెచ్ఐవీ, మెడికల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ప్రవేశ రుసుం రూ. 100 ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 13, 14న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సురేందర్ తెలిపారు.

## ఎల్‌బీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషి

పోచమ్మమైదాన్, నవంబర్ 5: ఇంజినీరింగ్ విద్యార్థి తుమ్మ జయసింహారెడ్డి జ్ఞాపకార్థం శరత్ మాక్రివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 13వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి స్మారకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దాతల సహకారాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మ శ్రీధర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నేడు ఆటోనగర్‌లో కార్మికులకు..**

పోచమ్మమైదాన్: కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో వరంగల్ ఆటోనగర్‌లో సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆటోనగర్‌లో పని చేస్తున్న కార్మికులు లేబర్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ శిబిరంలో సుమారు 53 రకాల పరీక్షలను ఉచితంగా చేసి, అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

## నన్నపునేనికి మద్దతుగా కదిలిన యువత



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్

గిర్మాజీపేట, నవంబర్ 5: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నరేందర్ గెలుపును కాంక్షిస్తూ యువత కదిలింది. ఆదివారం సాయంత్రం 26వ డివిజన్ యూత్ నాయకులు, మున్నూరుకాపు జిల్లా అధ్యక్షుడు, 26వ డివిజన్ నాయకుడు కొరివి పరమేశ్వర్ ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ సముదాయం వద్ద ఎమ్మెల్యే నరేందర్‌కు గజమాలతో ఘన స్వాగతం పలికి, 26వ డివిజన్ వివేకానంద సెంటర్ మీదుగా రెండు వేల మంది అభిమానులతో భారీ బైక్ ర్యాలీ, కోలాటాల మధ్య కారుపై నుంచి ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం లక్ష్మీపురం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పరమేశ్వర్‌తోపాటు ఆయన మిత్ర బృందానికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ పథకాలకు ఆకర్షితులై, తనపై అభిమానంతో పార్టీలో చేరిన పరమేశ్, వారి మిత్ర బృందాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కనీవినీఎరుగని రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలందరూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.